సందేశం

*2022 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు*

*అమరుల సంస్మరణ వారాన్ని పాటించండి!*

**భారత విప్లవ నిర్మాతలు, మహోపాధ్యాయులు,**

**మన పార్టీ సంస్థాపక నాయకులు**

**కామ్రేడ్ చారు మజుందార్ 50వ వర్ధంతి,**

**కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ 40వ వర్ధంతిలను**

**గొప్ప విప్లవ స్ఫూర్తి, విప్లవ సంకల్పంతో నిర్వహించండి!**

# భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేసే లక్ష్యంతో

# శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడించండి!

*పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ కమాండర్లు, యోధులకు, వివిధ విప్లవ ప్రజా నిర్మాణాలకు,*

*కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, సమస్త పీడిత ప్రజానీకానికి*

*సీ.పీ.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు!*

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## *2022 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని పాటించండి!*

## భారత విప్లవ నిర్మాతలు, మహోపాధ్యాయులు, మన పార్టీ సంస్థాపక నాయకులు, కామ్రేడ్ చారు మజుందార్ 50వ వర్ధంతి, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ 40వ వర్ధంతిలను గొప్ప విప్లవ స్ఫూర్తి, విప్లవ సంకల్పంతో నిర్వహించండి!

## భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేసే లక్ష్యంతో శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడించండి!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా,**

త్వరలో జులై 28 అమరుల స్మారకదినం సందర్భంగా మనం దేశ, ప్రపంచ పీడిత ప్రజల విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను ధారబోసిన అమరులందరినీ శ్రద్ధతో, గౌరవ భావంతో ఈ రోజు గుర్తు చేసుకోబోతున్నాం. ఈసారి దీని ప్రత్యేకత ఏమంటే మన భారత విప్లవ మహోపాధ్యాయులలో ఒకరు కామ్రేడ్ చారు మజుందార్ (సీఎం) 50వ వర్ధంతి. 1972 జులై 16వ తేదీన ఆయనను పోలీసులు కోల్‌కతాలో ఒక ఇంటిలో అరెస్టు చేసారు. 12 రోజుల తర్వాత, ఫాసిస్టు పాలకవర్గాల ఆదేశం ప్రకారం, పోలీసుల అదుపులో ఉన్న సమయంలోనే, ఆయన ఉబ్బసం వ్యాధికి ప్రాణవాయువు అందకుండా చేసి, ఆయనను జులై 28న హత్య చేసారు. మన భారత విప్లవ మహోపాధ్యాయులలో మరొకరు కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ (కేసీ) తీవ్ర అనారోగ్యంతో 1982 జులై 18న మన నుంచి శాశ్వతంగా వదిలివెళ్లారు. వీరిద్దరి అమరత్వంతో భారత విప్లవానికి అతిపెద్ద నష్టం జరిగింది. జులై 28 అమరుల స్మారక దినం సందర్భంగా కామ్రేడ్ సీఎం 50వ వర్ధంతి, కామ్రేడ్ కేసీ 40వ వర్ధంతిలను పురస్కరించుకుని వీరితో పాటు నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం నుండి నేటి వరకు భారత నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అంతిమంగా సోషలిజం, కమ్యూనిజం స్థాపన లక్ష్యంగా అత్యున్నత త్యాగాలు చేసిన అమరులందరికీ మన కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.

పెరూ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు కామ్రేడ్ గొంజాలోను సుదీర్ఘకాలం పాటు జైలులో బంధించిన అమెరికా-పెరూ ఫాసిస్టు పాలకులు చివరకు ఆయన ప్రాణాలను సైతం బలి తీసుకున్నారు. దీంతో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ఒక మహా నాయకుడిని కోల్పోయింది. ఫిలిప్పీన్స్ న్యూ పీపుల్స్ ఆర్మీ అధికార ప్రతినిధి కామ్రేడ్ కా ఒరిస్‌ని అమెరికా-ఫిలిప్పీన్స్ ఫాసిస్టు పాలకులు హత్య చేసారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రజల ప్రియతమ నాయకులు కామ్రేడ్ గొంజాలోకు, ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ కా ఒరిస్‌కు, ప్రపంచవ్యాప్తంగా విప్లవోద్యమాలలో, జాతీయ విముక్తి ఉద్యమాలలో అశువులు బాసిన వీరయోధులందరికీ కేంద్రకమిటీ

విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామని ప్రతిన బూనుతున్నది.

ఈ అమరులందరి స్మృతిలో 2022 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని వారి త్యాగాల స్ఫూర్తితో, విప్లవ సంకల్పంతో జరుపుకోవాలనీ, ఈ సందర్భంగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేసే లక్ష్యంతో వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడించాల్సిందిగా పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ బలగాలకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మేధావులకు సమస్త పీడిత వర్గాల, ప్రత్యేక సామాజిక సెక్షన్ల ప్రజలకు పిలుపునిస్తున్నది.

వర్గ పోరాటంలో, ప్రజాయుద్ధంలో అమరత్వం సాధారణ విషయమే. అమరుల త్యాగాల ఫలితంగానే వర్గ పోరాటం, ప్రజాయుద్ధం తీవ్రతరం అవడంతో పాటు వాటి విస్తృతి పెరుగుతూ వచ్చింది. భారత విప్లవోద్యమం నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాట కాలం నుండి శత్రు దాడులను ఎదుర్కొనడం మొదలైంది. భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూల్చి దాని స్థానంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించాలనే సైద్ధాంతిక-భావజాలపరమైన, ఆచారణాత్మక స్పష్టత ఏర్పడడంతో పాటు లక్ష్యం పట్ల అంకితభావం, త్యాగ సంసిద్ధత పెంపొందుతూ వచ్చాయి. చైతన్యవంతమైన యువతీ, యువకులు పార్టీ నాయకత్వంలో భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి తమ నెత్తురు చిందిస్తూ వచ్చారు. శత్రువుకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో కొన్నిసార్లు మన పార్టీ తాత్కాలిక వెనకంజలను ఎదుర్కొన్నది కానీ అది ఎప్పుడు కూడా ఎర్రజెండా గౌరవానికి, దాని ప్రతిష్టకు ఎలాంటి భంగం కలగనీయలేదు. ఓటమి నుండి గుణపాఠాలు తీసుకుంటూ అమరుల త్యాగాలందించిన విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగుతూ వచ్చింది. మనం నక్సల్బరీ వారసులం. మన పార్టీ వేలాది అమరుల వెలకట్ట లేని త్యాగాలతో భారత విప్లవానికి నాయకత్వం వహిస్తున్నది. అమరులు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత వెలుగులో భవిష్యత్తు గెలుపు పట్ల ఆశ, విశ్వాసంతో మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికీ, అంతిమంగా ప్రపంచవ్యాప్తంగా సోషలిజాన్ని-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో తమ ప్రాణాలను ధారబోశారు.

గడచిన సంవత్సర కాలంలో భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో దీర్ఘకాల ప్రజాయుద్ధంలో తమ వంతు పాత్ర పోషిస్తూ 124 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ కాలంలో భారత దళారీ పాలకవర్గాల క్రూరమైన దాడి, సామ్రాజ్యవాద వ్యవస్థ సృష్టించిన అనారోగ్య వాతావరణంలో రోగాల బారిన పడి మన కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు తీవ్రమైన నష్టం జరిగింది. కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ తాపస్ దా (పతిత్ పావన్ హల్దార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీ కార్యదర్శి) జైలులో సుదీర్ఘకాలం దారుణమైన మానసిక, శారీరక చిత్రహింసల మధ్య చిక్కిశల్యమైన స్థితిలో 2019లో ప్రభుత్వం ఆయనను జైలు నుంచి విడుదల

చేసిన రెండు నెలల్లోనే 2019 సెప్టెంబర్ 4న తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసారు. కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ చింతన్ దా (నరేంద్రసింగ్) దుర్భరమైన పరిస్థితులలో సుదీర్ఘ జైలు జీవనం, శత్రు చిత్రహింసల ఫలితంగా తీవ్ర అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లి 2020 జనవరి 6న తుదిశ్వాస విడిచారు. కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ అంబర్ దా/గగన్ దా/సాహేబ్ దా (పూర్ణేందు శేఖర్ ముఖర్జీ) సీఓపీడీ వ్యాధితో దీర్ఘకాలంగా పోరాడుతూ 2021 ఆగస్టు 7న కన్నుమూసారు. కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ రామకృష్ణ/సాకేత్ దా (అక్కిరాజు హరగోపాల్) మూత్రపిండాల వైఫల్యంతో 2021 అక్టోబర్ 14న భౌతికంగా ఎప్పటికీ మన నుంచి దూరమయ్యారు. కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ దీపక్ దా (మిలింద్ బాబూరావ్ తేల్‌తుంబ్డే) 2021 నవంబర్ 13న మర్దిన్‌టోలా–పారెవా ఎన్‌కౌంటర్‌లో శత్రు బలగాలతో గంటల తరబడి హోరాహోరీ పోరాడుతూ 26 మంది పీఎల్‌జీఏ సాహసిక యోధులతో పాటు అమరులయ్యారు. గడచిన మూడేళ్ల కంటే తక్కువ కాలంలో భారత విప్లవోద్యమానికి, పీడిత ప్రజలకు ఎంతో ప్రియమైన ఈ నాయకుల అమరత్వంతో నిజానికి మన పార్టీకి చాలా పెద్ద నష్టం జరిగింది. వీరితో పాటు బిహార్–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ రూపేష్ దా/విజయ్ యాదవ్ (సందీప్ యాదవ్) 2022 మే 25న అనుమానాస్పదంగా మృతి చెందినట్లు తెలుస్తోంది. రిపోర్టును బట్టి ఇది శత్రు కోవర్ట్ ఆపరేషన్‌గా భావించాల్సి వస్తోంది. అలాగే 2019 జనవరి 13న తూర్పు బిహార్–ఈశాన్య ఝార్ఖండ్ సాక్ సభ్యులు కామ్రేడ్ తాలా దా/అగ్ని (సహదేవ్ రాయ్ మాంఝీ), 2020 జులై 10న 2యు సాక్ సభ్యులు కామ్రేడ్ నకుల్ వేర్వేరు శత్రు కోవర్ట్ ఆపరేషన్లలో అమరులయ్యారు. పార్టీ సీనియర్ కార్యకర్త కామ్రేడ్ ఆలూరి లలిత 2021 నవంబర్ 21న గుండెపోటుతో కన్నుమూసారు. డీకే ఎస్‌జడ్‌సీ సెక్రటేరియట్ సభ్యురాలు కామ్రేడ్ నర్మద (ఉప్పుగంటి నిర్మల) తీవ్రమైన కేన్సర్‌కు వైద్యం కోసం వెళ్లి, శత్రువు చేతిలో చిక్కి, ముంబయి జైలు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ, సరైన వైద్యం లభించని కారణంగా 2022 ఏప్రిల్ 9న తుదిశ్వాస విడిచారు. 2021 డిసెంబర్ 22న అఖిల భారత విప్లవ సాంస్కృతికోద్యమ నాయకుడు కామ్రేడ్ రాజ్‌కిశోర్ అనారోగ్యంతో కన్నుమూసారు. 2022 మార్చి 19వ తేదీన గుండెపోటుతో పార్టీ సీనియర్ కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ జననాట్యమండలి కళాకారుడు కామ్రేడ్ డప్పు రమేష్ తుదిశ్వాస విడిచారు. 2021 జులై 15న బిహార్ రీజనల్ కమిటీ సభ్యులు బుధేశ్వర్ ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. 2022 మే 5న బిహార్‌లో పార్టీ సీనియర్ నాయకులు కా. త్యాగీజీ/బాబా (శివ్‌శంకర్ రజక్) అనారోగ్యంతో కన్నుమూసారు. (శత్రు తీవ్ర నిర్బంధం కారణంగా అమరులైన కొంత మంది నాయకత్వం, కేడర్ల సమాచారం ఆలస్యంగా తెలిసింది. వారికి ఈ సందర్భంగా కేంద్రకమిటీ విప్లవ నివాళి అర్పిస్తున్నది).

వీరితో పాటు ఈ కాలంలో అమరులైన వారిలో సెంట్రల్ రీజనల్ కంపెనీ–2లో నలుగురు కామ్రేడ్స్, బిహార్–ఝార్ఖండ్ (బీజే)లో 8 మంది, తూర్పు బిహార్–ఈశాన్య ఝార్ఖండ్

(తూ.బి.–ఈ.ఝా.)లో 13 మంది, దండకారణ్యం (డీకే)లో 69 మంది, ఆంధ్ర–ఒడిశా బార్డర్ (ఏఓబీ)లో ముగ్గురు, ఒడిశాలో ఒకరు, మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ (ఎమ్ఎమ్‌సీ)లో 8 మంది, తెలంగాణలో 13 మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు కామ్రేడ్స్ వున్నారు. వీరిలో 34 మంది మహిళా కామ్రేడ్స్ వున్నారు. 9 మంది డీవీసీ/సీవైపీసీ స్థాయి కామ్రేడ్స్ – కామ్రేడ్ సుక్‌లాల్ (రాంసాయి పర్చామి, ఉత్తర గడ్చిరోలి డీవీసీ కార్యదర్శి, డీకే), కామ్రేడ్ మంటు ఖైరా (జడ్‌సీఎం, బీజే), కామ్రేడ్ మహేష్ (శివాజీ గోటా, ఉత్తర గడ్చిరోలి డివిజనల్ కమాండర్ ఇన్ చీఫ్, డీకే), కామ్రేడ్ లోకేష్ (జోగాల్ పొడియం, కంపెనీ–4 సీవైసీఎమ్, డీకే), కామ్రేడ్ దిలీప్ తులావి (కంపెనీ–4 సీవైసీఎమ్, డీకే), కామ్రేడ్ ధర్మూ (మంగు కల్మొ, కంపెనీ–4 సీవైసీఎమ్, డీకే), కామ్రేడ్ సన్ను (ఉత్తర గడ్చిరోలి ఆల్టర్నేట్ డీవీసీఎం, డీకే), కామ్రేడ్ అరుణ్ (ఉరసం కమ్లూ, ఉత్తర గడ్చిరోలి ఆల్టర్నేట్ డీవీసీఎం, డీకే), కామ్రేడ్ సాకేత్ (కంపెనీ–6 కమాండర్, సీవైపీసీఎం, డీకే); 32 మంది ఏసీ/పీపీసీ సభ్యులు, 32 మంది పార్టీ/పీఎల్‌జీఏ సభ్యులు, 21 మంది కామ్రేడ్స్ విప్లవ ప్రజా నిర్మాణాల నాయకులు/ కార్యకర్తలు (ఆర్‌పీసీ అధ్యక్షులు/సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజా మిలీషియా కమాండర్లు/ సభ్యులు), 8 మంది విప్లవ సానుభూతిపరులు, విప్లవ ప్రజలు వున్నారు. వీరిలో 69 మంది కామ్రేడ్స్ ఎన్‌కౌంటర్లలో, 19 మంది బూటకపు ఎన్‌కౌంటర్లలో, 27 మంది అనారోగ్యాలతోనూ, ముగ్గురు కామ్రేడ్స్ జైళ్లలో అధికారుల నిర్లక్ష్యంతో సరైన వైద్యం అందకపోవడం వల్లనూ, నలుగురు కామ్రేడ్స్ దుర్ఘటనలలోనూ అమరత్వాన్ని పొందారు. ముగ్గురు కామ్రేడ్స్ అమరత్వపు వివరాలు అందలేదు. 17 మంది కామ్రేడ్స్ వివరాలు అందాల్సి వుంది. వీరే కాకుండా దేశవ్యాప్తంగా బహిరంగ ఉద్యమాలలో పని చేస్తున్న పలువురు విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విప్లవ సానుభూతిపరులు, మిత్రులు ఈ సంవత్సర కాలంలో కన్నుమూసారు.

2004 సెప్టెంబర్ 21న రెండు విప్లవ స్రవంతులు – ఎమ్‌సీసీఐ, సీపీఐ (ఎం–ఎల్) (పీపుల్స్‌వార్)లు ఒకే మహా ప్రవాహంగా సమైక్యం కావడంతో ఏర్పడిందే మన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు). ఐక్య పార్టీ కామ్రేడ్ సీఎం, కామ్రేడ్ కేసీలను పార్టీ సంస్థాపక నాయకులుగా, భారత విప్లవ మహోపాధ్యాయులుగా గుర్తించింది. వీరిద్దరూ మార్క్సిజం–లెనినిజం– మావోయిజం వెలుగులో, విప్లవ ఆచరణ ద్వారా ఆ సిద్ధాంత మాన్యతను సుస్థాపితం చేస్తూ, భారత విప్లవ పంథాలో సమూల మార్పును తీసుకొచ్చే కృషిని సాగిస్తూ సరైన పంథాను ఆవిష్కరించారు. 1967 నక్సల్బరీ సాయుధ వ్యవసాయ విప్లవ తిరుగుబాటు జరిగిన సంవత్సరం. ఇదే సంవత్సరంలో విప్లవ ఆచరణ ద్వారా రివిజనిజంతో నిర్ణయాత్మకంగా తెగతెంపులు చేసుకుని భారత విప్లవానికి దీర్ఘకాల ప్రజాయుద్ధ విప్లవ పంథా రూపొందింది. ఇది సైద్ధాంతిక, రాజకీయ మార్పుకు సంకేతంగా నిలిచి, భారత నూతన ప్రజాస్వామిక విప్లవ యావత్తు మౌలిక సమస్యల పరిష్కారానికి మార్గాన్ని రూపొందించింది. ఇది కుళ్లిపోయిన పాత పార్టీ వ్యవస్థలను, వాటితో యావత్తు లాంఛనప్రాయమైన

సంబంధాలను వదిలించుకుంది, ధ్వంసం చేసింది. రివిజనిస్టు బంధాలను తెంచుకోవడంతో ప్రజల చొరవ బయటకు వచ్చింది, వర్గ పోరాటంలో వారి సృజనాత్మకత బయటపడింది. తద్వారా, ఒక నూతన రకం కమ్యూనిస్టు పార్టీని పెంపొందించే క్రమంలో, బీజరూపంలో దాని నూతన సైన్యాన్ని నిర్మించడం, నూతన రాజకీయాధికారాన్ని బీజరూపంలో స్థాపించే క్రమంలో, దేశంలో వివిధ ప్రాంతాల్లో విప్లవ పోరాటాలు దావానలంలా వ్యాపించాయి. భారత విప్లవ పంథాను సమూలంగా మార్చిన ఈ తిరుగుబాటు చాలా తక్కువ కాలంలోనే యావత్తు భారతదేశ సమాజాన్ని కుదిపివేసింది, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, విలువలలో, ఆలోచన క్రమంలో, మొదలైన యావత్తు రంగాలలో మరుపురాని ముద్ర వేసింది. అలా అది భారత విప్లవ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి, ఒక నూతన వీరోచిత ధారావాహిక పోరాటాన్ని, నిస్వార్థ త్యాగాల పరంపరను ఆరంభించింది. ఇది భారత దీర్ఘకాల ప్రజాయుద్ధానికి ఆరంభం. దీని రూపశిల్పి, మార్గదర్శకులు కామ్రేడ్ సీఎం. ఇదే విధంగా, కామ్రేడ్ కేసీ అతలాకుతలంగా గడిచిన 1960 దశకంలో కృశ్చేవ్ రివిజనిజానికి, భారతదేశంలో దాని అనుచరులకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాన్ని సాగిస్తూ, భావజాలపరమైన, రాజకీయ, నిర్మాణపరమైన విషయాలతో సహా ప్రతి ఒక్క సమస్యలోనూ రివిజనిజంతో ఒక స్పష్టమైన విభజన రేఖను గీయడంలో, భారత విప్లవానికి సాయుధ వ్యవసాయ విప్లవ పంథాను, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను అందించడంలో ఒక అసాధారణమైన, అగ్రశ్రేణి నాయకులుగా ఆవిర్భవించారు. మన ప్రియమైన ఈ నాయకత్వ ద్వయం మహోన్నతమైన కమ్యూనిస్టు జీవితాల నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠాలు ఎన్నో ఉన్నాయి. అవి మనకు ఎంతో ప్రేరణను అందిస్తాయి. సీఎం 50వ, కేసీ 40వ వర్ధంతుల సందర్భంగా భారత విప్లవానికి వారందించిన మహోన్నత, అసాధారణ సేవలను సంస్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో నడుస్తూ, దేశంలో కొనసాగుతున్న సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని ఉన్నతస్థాయికి ఎదిగించేందుకు పాటుపడదాం. వారి మహోన్నత కార్మికవర్గ విలువల్ని అలవరుచుకుంటూ విముక్తి ప్రాంతాలను, ప్రజాసైన్యాన్ని నిర్మించే లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోతూ అన్ని రంగాల్లో శత్రువుతో సాహసోపేతంగా పోరాడుదాం. వారు మనకందించిన అరుణకేతనాన్ని మరింత ఉన్నతంగా ఎత్తిపడుతూ మూడు అద్భుత ఆయుధాలు – పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనలను మరింత బలోపేతం చేద్దాం. తద్వారా భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం–కమ్యూనిజం వైపు పురోగమిద్దాం.

కామ్రేడ్ తాపస్ దా అమరుడయ్యేనాటికి ఆయన వయసు 57 ఏళ్లు. ఆయన పశ్చిమ బంగ్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. నక్సల్బరీ అందించిన ప్రేరణతో విప్లవోద్యమంలో చేరి రాష్ట్రంలో 1980–90 దశకాల్లో వ్యవసాయ విప్లవాన్ని నిర్మించడంలో, 'బ–భ' అవకాశవాద ముఠా ముందుకు తెచ్చిన అవకాశవాద, వర్గసంకర పంథాను తిప్పికొట్టడంలో ఆయన పాత్ర ఎంతో చెప్పుకోదగినది. ఆయన కామ్రేడ్ మావో రచించిన 'సరియైన భావాలు ఎక్కడి నుండి

వస్తాయి?' అనే వ్యాసం నుంచి 'ఉత్పత్తి కోసం పోరాటం, వర్గపోరాటం, శాస్త్రీయ ప్రయోగాల నుండే సరైన భావాలు వస్తాయి' అనే బోధనను ఎల్లప్పుడూ అమలు చేసేవారు. ఐక్య పార్టీలో కేంద్రకమిటీ సభ్యునిగా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా ఎన్నికైనారు. 2005లో అరెస్టయ్యారు. సుదీర్ఘ జైలు జీవితంలో జైలు పోరాటాల్లో ముందువరుసలో ఉన్నారు. కామ్రేడ్ తాపస్ మన యావత్తు కమ్యూనిస్టు విప్లవకారులకు నిరంతరం ప్రేరణగా నిలుస్తారు.

కామ్రేడ్ చింతన్ దా అమరుడయ్యేనాటికి ఆయన వయస్సు 70 సంవత్సరాలు. ఆయన బిహార్‌లోని ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించారు. హిమాలయాల్లో తెరాయి (బిహార్–నేపాల్) క్షేత్రంలోని ఆదివాసీల మీద పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. మార్క్సిజం పట్ల ఆకర్షితులై ఉద్యమంలోకి వచ్చారు. ఢిల్లీ పరిసర ప్రాంతంలో కార్మికోద్యమాన్ని నిర్మించారు. మునుపటి ఎమ్‌సీసీలో చేరి ఉత్తర బిహార్‌లో విప్లవోద్యమ బాధ్యతలు నిర్వహిస్తూ, రాష్ట్రకమిటీ సభ్యుడుగా, కేంద్రకమిటీ సభ్యునిగా పనిచేశారు. విప్లవ జీవితంలో మూడుసార్లు అరెస్టు అయి జైలు పాలయ్యారు. విడుదలైన ప్రతిసారి మరింత దృఢసంకల్పంతో మళ్లీ ఉద్యమంలో చేరారు. చివరి వరకూ ప్రజల కోసం, పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన ఆయన దృఢ సంకల్పం, త్యాగనిరతి మనకు అనుసరణీయం.

కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముఖర్జీ అమరుడయ్యేనాటికి ఆయన వయస్సు 75 సంవత్సరాలు. సుమారు 45 సంవత్సరాలు విప్లవోద్యమంలో పనిచేశారు. ఆయన నక్సల్బరీ పోరాటాల ప్రభావంతో విప్లవోద్యమంలో చేరి కార్మికోద్యమంలో పని చేశారు. పట్టణోద్యమాలకు నాయకత్వం వహించారు. 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'కు వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రజాందోళనలను నిర్మించడంలో ప్రముఖ పాత్ర వహించారు. కేంద్రకమిటీ సభ్యునిగా చాలా కాలం పనిచేశారు. ఆయన అనుసరించిన విప్లవ దృఢ దీక్ష, ఆదర్శాలు, క్యాడర్లతోను, ప్రజలతోను కలిసిపోవడం వంటి లక్షణాలు మనకు అనుసరణీయం.

కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ అమరుడయ్యేనాటికి ఆయన వయస్సు 63 సంవత్సరాలు. 1980 దశకంలో విద్యార్థి ఉద్యమం నుండి విప్లవోద్యమంలో చేరారు. గత 40 సంవత్సరాలుగా విప్లవోద్యమంలో పనిచేస్తూ మొదట గుంటూరు జిల్లాకమిటీ సభ్యునిగానూ, తరువాత జిల్లా కార్యదర్శిగానూ, ఆ తరువాత రాష్ట్రకమిటీ సభ్యునిగానూ, రాష్ట్రకమిటీ కార్యదర్శిగానూ, 2001లో కేంద్రకమిటీ, 2018లో పొలిట్‌బ్యూరో సభ్యునిగానూ విప్లవోద్యమానికి నాయకత్వం వహించారు. 2000 నుండి 2005 వరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగానూ, 2008 నుండి 2016 వరకూ ఏఓబీ కార్యదర్శిగానూ పనిచేశారు. ఆయన దృఢదీక్ష, సైద్ధాంతిక పటిమ, ప్రజాస్వామిక భావాలు, క్యాడర్ల, ప్రజల పట్ల ప్రేమ సదా అనుసరణీయాలు.

కామ్రేడ్ దీపక్‌దా మహారాష్ట్రలో పేద కార్మిక కుటుంబంలో జన్మించారు. అమరుడయ్యేనాటికి ఆయన వయసు 56 సంవత్సరాలు. బొగ్గు గని కార్మికుడిగా పనిచేస్తూ ట్రేడ్ యూనియన్ నాయకుడిగా

ఎదిగి అనేక మిలిటెంట్ పోరాటాలకు నాయకత్వం వహించారు. 1992లో విప్లవోద్యమంలో చేరి 1992-2021 మధ్య కార్మిక, రైతాంగ, విద్యార్థి, యువజన రంగాల్లో వివిధ స్థాయిలలో పని చేస్తూ భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన అన్ని రంగాల అభివృద్ధి కోసం సిద్ధాంత, రాజకీయ కృషి చేస్తూ డైనమిక్ పాత్ర నిర్వహించాడు. ఆయన పీడిత వర్గాల, ప్రత్యేకంగా సాంఘిక ప్రజా సముదాయాల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడు. కామ్రేడ్ దీపక్ దా అందించిన సిద్ధాంత రాజకీయాలు, నెలకొల్పిన ఆదర్శాలు సదా విప్లవకారులను, భారత ప్రజలను ప్రేరేపిస్తుంటాయి.

కామ్రేడ్ రూపేష్ దా బిహార్‌లోని గయా జిల్లాలో జన్మించారు. అమరుడయ్యేనాటికి సుమారు 54 సంవత్సరాలు వయసు ఉంటుంది. ఆయన రాష్ట్రంలోని ఔరంగాబాద్, గయ, మధ్య జోన్ ప్రాంతాల్లో గత 25 యేళ్లుగా సాయుధ వ్యవసాయ విప్లవ సాయుధ వర్గ పోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని, ప్రజాయుద్ధాన్ని ఉన్నతస్థాయికి ఎదిగించడంలో ముఖ్య పాత్ర పోషించారు. అంచలంచలుగా బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సెక్రటేరియట్ సభ్యులుగా, స్పెషల్ ఏరియా మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జిగా అభివృద్ధి అయ్యారు. విప్లవోద్యమం తాత్కాలికంగా వెనకంజ వేసినప్పటికీ, తీవ్ర అనారోగ్యం మధ్య, పార్టీనీ, కేడర్లను, ప్రజలను, ప్రత్యేకించి పీడిత-తాడిత-దళిత ప్రజలను అంటిపెట్టుకుని ఉద్యమ పునరుద్ధరణకు కృషి చేసారు. ఆయన అంకితభావం, సాహసం, అందించిన అనుభవాలు భవిష్యత్ విప్లవ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయి.

కామ్రేడ్ నకుల్ అమరుడయ్యేనాటికి ఆయన వయసు 48 సంవత్సరాలు. ఉత్తర బిహార్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1990 దశకం మధ్యలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో ప్రభావితుడై ఉద్యమంలో భాగమయ్యారు. ఉత్తర బిహార్ జోనల్ కమిటీ సభ్యుడిగా, త్రీ-యు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడుగా అభివృద్ధి అయ్యారు. 2011లో అరెస్టై జైలులో కూడా పోరాటాలకు నాయకత్వం వహించి పార్టీ ప్రతిష్ట పెంచారు. 2014లో జైలు నుండి విడుదలైన వెంటనే సాయుధ పోరాటంలో భాగమైనారు. తుదివరకు 2యు విప్లవోద్యమాన్ని పునర్నిర్మించే కృషిలో ముఖ్య పాత్ర పోషించారు. కామ్రేడ్ నకుల్ సాహసం, కష్టపడేతత్వం, నిజాయితీ, కలుపుగోలుతనం, విశ్వాసపాత్రత, ప్రతిభ, ఉన్నత చైతన్యం యువ కమ్యూనిస్టు తరానికి సదా ప్రేరణనందిస్తూనే ఉంటాయి.

కామ్రేడ్ తాలా/అగ్ని ఝార్ఖండ్‌లోని సంతాల్ పరగణాలో జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్ కోసం కొనసాగుతున్న పోరాటాలలో ప్రముఖ ప్రజా నాయకులు. ప్రజలు ప్రేమగా 'తాలా దా' అని పిలుస్తారు. అమరుడయ్యేనాటికి ఆయనకు 30 యేళ్లు. మధ్యతరగతి ఆదివాసీ రైతు కుటుంబంలో జన్మించారు. విప్లవ కుటుంబంలో పుట్టడంతో వూహ తెలిసినప్పటి నుంచి విప్లవ కార్యకలాపాల్లో భాగమయ్యారు. రైతులను, కార్మికులను సంఘటితం చేసి విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేస్తూ అంచలంచలుగా తూ.బి.-ఈ.ఝూ. సాక్ సభ్యుడిగా ఎదిగారు. ఆయనలో శత్రువు పట్ల వర్గకసి,

ప్రజల పట్ల ప్రేమ, ప్రజలను ప్రేరేపించడంలో మంచి కళ ఆయనలో ఉండేవి. శత్రు చుట్టివేతలను బద్దలు కొట్టి రక్షించడంలో ముందువరుసలో ఉండేవారు. పార్టీ, విప్లవం పట్ల ఆయన అంకితభావం, వర్గకసి, సాహసం, క్రమశిక్షణ విప్లవకారులకు ప్రేరణగా నిలుస్తాయి.

కామ్రేడ్ ఆలూరి లలిత ప్రముఖ విప్లవ రచయిత భుజంగరావు జీవన సహచరి. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లాలో జన్మించారు. ఆమె వయసు 76 యేళ్లు. దిగవ మధ్యతరగతి కుటుంబం. తమ కుటుంబాన్ని, పిల్లల్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన త్యాగశీలి. దశాబ్ద కాలం రహస్య జీవితంలో ఉంటూ పార్టీ అప్పగించిన విప్లవ బాధ్యతలన్నీ పట్టుదలతో నెరవేర్చారు. దండకారణ్య ఉద్యమ అధికార పత్రిక 'ప్రభాత్' నిర్వహణలో ఆమె విప్లవ సేవలు నిక్షిప్తమై ఉన్నాయి. చివరి వరకూ గొప్ప అంకిత భావంతో, విశ్వసనీయమైన పార్టీ సభ్యురాలుగా విప్లవాన్ని కాంక్షించారు. ఆలూరి లలిత గారి విప్లవ సేవలు చిరస్మరణీయం.

కామ్రేడ్ నర్మద ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లాలో జన్మించారు. ఆమె వయసు 62 యేళ్లు. నాలుగు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో పని చేసారు. మూడు దశాబ్దాలకు పైగా దండకారణ్య ఉద్యమ, మహిళా ఉద్యమ నాయకత్వంలో ఉండి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పలు బాధ్యతలు నిర్వహించారు. ముందు సాహిత్య ప్రచురణా రంగంలో పని చేసిన తర్వాత దండకారణ్యంలో గఢ్‌చిరోలి ఉద్యమంతో పెనవేసుకుపోయారు. శత్రు బహుముఖ నిర్బంధ రూపాలను ఎదుర్కొంటూ పార్టీ ఇచ్చిన మార్గదర్శకత్వంలో గఢ్‌చిరోలి ఉద్యమాన్ని నిలబెట్టిన, ప్రజాదరణ పొందిన నాయకులలో ఆమె ఒకరు. భయానక కేన్సర్ వ్యాధి సోకినప్పటికీ, శత్రు చేజిక్కినప్పటికీ, వెరుపెరుగక చివరి ఊపిరి వరకు పీడిత ప్రజలకు, విప్లవోద్యమానికి జీవితాన్ని అర్పించారు. కామ్రేడ్ నర్మద బోల్షివిక్కు స్ఫూర్తి, ప్రజాయుద్ధ కార్యాచరణ, కమ్యూనిస్టు విలువలు విప్లవకారులకు సదా ప్రేరణనందిస్తుంటాయి.

కామ్రేడ్ డప్పు రమేష్ ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లాలో పేద కుటుంబంలో పుట్టారు. ఆయన వయసు 61 యేళ్లు. ఆయన 1980 దశకం నుంచి నాలుగు దశాబ్దాల పాటు జననాట్యమండలి (జేఎన్ఎం) కళాకారుడిగా విప్లవ సాంస్కృతిక ఉద్యమాభివృద్ధికి కృషి చేసారు. పీడిత తాడిత వంచిత ప్రజలకు తన గొంతును విప్లవ గీతాలు రాయడం, ఆలపించడం కోసం అంకితం చేసారు. సమకాలీన రాజకీయ సమస్యలపై కారంచేడు బ్యాలే, వీధి నాటకాలు ప్రదర్శించారు. భూస్వాముల అన్యాయానికి, అణచివేతకు వ్యతిరేకంగా చివరి ఊపిరి వరకు పోరాడారు. ప్రజా పోరాటాలను నిర్మించేందుకు, అభివృద్ధి చేసేందుకు పాటను, 'డప్పు'ను తన ఆయుధాలుగా ఉపయోగించారు. దళితులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా జేఎన్ఎం సాంస్కృతిక క్యాంపెయిన్‌లలో ఆయన పాల్గొన్నారు. దోపిడీ వర్గాల పట్ల ఆయన కసి, పీడిత ప్రజల పట్ల అంకిత భావం విప్లవకారులకు ఆదర్శంగా నిలుస్తాయి.

కామ్రేడ్ బుద్ధేశ్వర్ వయసు 40 ఏళ్లు. ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో పేద ఉరావ్ ఆదివాసీ

కుటుంబంలో జన్మించారు. హైస్కూల్ విద్యనభ్యసించి విప్లవోద్యమంలో చేరారు. ఆయన 25 యేళ్ల తన విప్లవ జీవితంలో పార్టీలో ఉద్యమంలో ఎంతటి కష్టాలెదురైనా చివరి వరకూ ప్రజలనంటి పెట్టుకొని పార్టీ ప్రతిష్టను పెంచారు. ఆయన అకుంఠిత దీక్ష, పోరాట పట్టుదల అనుసరణీయం.

ఈ సంవత్సర కాలంలో శత్రువు చేసిన పలు క్రూరమైన దాడులలో మన పార్టీ శ్రేణులు, పీఎల్‌జీఏ బలగాలు ధైర్యసాహసాలను, దృఢసంకల్పాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించి ఉన్నతమైన విప్లవ ఆదర్శాలను నెలకొల్పాయి. మర్దిన్‌టోలా–పారేవా ఎన్‌కౌంటర్ ఇందుకు ఉదాహరణ. మన సాహసిక నాయకుడు కామ్రేడ్ దీపక్ దా నాయకత్వంలో పీఎల్‌జీఏ బలగాలు ఏమాత్రం ఊగిసలాడకుండా ఉదయం నుంచి తిండి తినకుండా 12 గంటల పాటు ధైర్యసాహసాలతో శత్రువుతో పోరాడాయి. నాయకత్వాన్ని కాపాడాలనే దృఢసంకల్పంతో ఒక కిలోమీటరు ప్రాంతం విస్తరించిన శత్రు చుట్టివేతను బ్రేక్ చేసేందుకు యావత్తు కామ్రేడ్స్ సమైక్యంగా పోరాడారు. సరెండర్ కమ్మంటూ శత్రువు చేసిన హెచ్చరికలను ధిక్కరిస్తూ మరింత బలంగా పోరాడారు. ఒకవైపు తోటి కామ్రేడ్స్ అమరులవుతున్నప్పటికీ ఏమాత్రం వెరవకుండా ప్రతి ఒక్కరూ కమాండర్ కాషన్‌ను పాటిస్తూ దొరికిన/అందుబాటులో ఉన్న కవర్లను ఉపయోగించుకుంటూ ప్రాణాలను ఫణంగా పెట్టి చివరి ఊపిరి వరకూ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. చివరకు శత్రు కవర్ల దగ్గరి వరకూ క్రాలింగ్‌లో, ఫైర్ అండ్ మూవ్‌మెంట్‌లో అడ్వాన్స్ అయి వాడిని వెనక్కునెట్టడం ద్వారా చుట్టివేతను తెంచుకుని మెజారిటీ కామ్రేడ్స్ బయటపడగలిగారు. ప్రజల మద్దతుతో సురక్షితంగా రిట్రీట్ అయ్యారు. అయితే బ్రేకింగ్ డ్రిల్‌ను మరింత వేగంగా, శత్రువు బలహీనంగా ఉన్న దిశలో, ఒకే చోట కేంద్రీకరించి యుద్ధ కౌశల్యంతో నిర్వహించి ఉంటే మన వైపు నష్టాలను తగ్గించుకోవడం సాధ్యమై ఉండేది.

పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ బలగాలు, ప్రజా నిర్మాణాలు, పీడిత ప్రజలు శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'–ప్రహార్ దాడిని తిప్పికొట్టే క్రమంలో వీరోచితంగా సాగించిన పోరాటాల ఫలితంగా గత సంవత్సర కాలంలో విప్లవోద్యమం పలు విజయాలు సాధించింది. ప్రజా వీరుల వీరోచిత త్యాగాలు లేకుండా ఈ విజయాలను ఊహించడం సాధ్యం కాదు. అయితే శత్రువు బలం అనేక రెట్లు అధికంగా ఉన్న ప్రస్తుత వ్యూహాత్మక ఆత్మరక్షణా దశలో వీలైనంత వరకు మన స్వీయాత్మక శక్తిని కాపాడుకుంటూ, వీలైనంత వరకూ శత్రు బలగాలను నిర్మూలించడమే యుద్ధ లక్ష్యంగా ఉండాలి. ఈ దృష్టితో పరిశీలించినప్పుడు, ఈ సంవత్సర కాలంలో మన పార్టీకి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో తీవ్ర నష్టాలు జరిగాయి. ఇదే కాలంలో మన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ కిషన్ దా, సీసీ సభ్యులు కామ్రేడ్స్ షీలా దీ, కంచన్ దా, కృష్ణమూర్తి, జశ్‌పాల్ జీ అరెస్టులు జరిగాయి. భారత దళారీ పాలకవర్గాలు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కొనసాగిస్తున్న భీషణ, ఫాసిస్టు 'సమాధాన్'–ప్రహార్ క్యాంపెయిన్లను అత్యంత సాహసోపేతంగా తిప్పికొడుతూ దేశవ్యాప్తంగా మరో విప్లవ ప్రభంజనాన్ని సృష్టించడానికి మన పార్టీ నాయకత్వంలో యావత్తు విప్లవ, ప్రజాస్వామిక శక్తులు కృషి చేస్తున్న నేటి అత్యంత క్లిష్ట పరిస్థితులలో, ఈ నష్టాలతో

భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేసే పనికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ నష్టాలకు కారణాలను లోతుగా సమీక్షించుకుని తగిన గుణపాఠాలు తీసుకుని వాటిని ఖచ్చితంగా అమలు చేయాలి. నష్టాలకు దారితీసిన పని పద్ధతులను తక్షణం మార్చుకోవాలి. నష్టాలను నివారించాలి. మన శక్తుల్ని పై నుంచి కింది వరకూ సంరక్షించుకుని అభివృద్ధి చేయాలి. వాస్తవిక పరిస్థితులకు పార్టీ మొత్తం అలవాటుపడాలి. శత్రు పరిస్థితిని, మన పరిస్థితిని, ప్రజల పరిస్థితిని సమగ్రంగా ఆకళింపు చేసుకోవడంలో ఉన్న వైఫల్యాన్ని గుర్తించాలి. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించి తగిన ఎత్తుగడలను, పని పద్ధతులను రూపొందించుకోవడంలో ఉన్న వైఫల్యాన్ని గుర్తించాలి. వాస్తవిక పరిస్థితులను (శత్రు, మన, ప్రజల పరిస్థితి) అర్థం చేసుకోవడం ద్వారా ఏఏ పనులు రహస్యంగా చేయాలనేది నిర్ణయించుకుని, మనకు నష్టం జరగకుండా ఉండే పని పద్ధతులను రూపొందించుకోగలుగుతాం. ఇది విప్లవశక్తుల జాగరూకతకు ఒక పెద్ద పరీక్ష. శత్రువు విప్లవ ప్రతీఘాతుకత్వాన్ని, ఆల్–అవుట్ వార్‌ను తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్న ప్రస్తుత సమయంలో, రహస్య పని విధానంలో ఏ కొంచెం నిర్లక్ష్యం వహించినా అది పార్టీకి ఎంతో నష్టం తీసుకువస్తుందనేది ఈ సంవత్సర కాలంలో జరిగిన నష్టాలు మనకు తెలియజేస్తున్నాయి.

శత్రువు హ్యూమన్ ఇంటెలిజెన్స్ (ఇన్‌ఫార్మర్లు, కోవర్టులు, ద్రోహులతో)ను వివిధ దొంతరలతో అత్యంత రహస్యంగా బలోపేతం చేసుకుంటున్నాడు. టెక్నికల్ ఇంటెలిజెన్స్ (పలు రకాల డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాలు, జీపీఎస్‌లు, జీపీఎస్ ట్రాకర్లు, మొబైల్స్, సర్వైలెన్స్ సాటిలైట్లు, వివిధ రకాల సర్వైలెన్స్ సాఫ్ట్‌వేర్ మొదలైన వాటి ద్వారా) అభివృద్ధి చేసుకున్నాడు. ఈ రెండింటితో ఏర్పడిన ఇంటెలిజెన్స్ గ్రిడ్ ఉద్యమ ప్రాంతాల నుంచి ఢిల్లీ వరకూ విస్తరించి ఉంది. మన గురించి సేకరించిన సమాచారంపై ఆధారపడి మనపై డ్రోన్ దాడులు చేయడం ద్వారా మనల్ని 2022 చివరి నాటికి నిర్మూలించే నిర్దిష్ట పథకంతో శత్రువు పెద్దెత్తున సన్నాహాలు చేసుకుంటున్నాడు. 2022 ఏప్రిల్ 14–15 అర్ధరాత్రి దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్‌లో చేసిన డ్రోన్ బాంబింగ్ ద్వారా ఇది స్పష్టమవుతోంది. గత సంవత్సరం ఇదే నెలలో 19వ తేదీన శత్రువు డ్రోన్ దాడి చేసాడు. కనుక శత్రు ఇంటెలిజెన్స్‌పై మన నిఘా ఉండాలి. దాన్ని ఎప్పటికప్పుడు ధ్వంసం చేయాలి. తగిన ఎయిర్ డిఫెన్స్ ఎత్తుగడలను దృఢంగా అమలు చేయాలి. మన తిండి పదార్థాలలో విషం కలిపి మనల్ని క్రూరంగా చంపాలని శత్రువు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాడు. అందువల్ల మన సప్లై మార్గాలను సురక్షితం చేసుకునే విధంగా శ్రద్ధ పెట్టాలి. పార్టీని రక్షించుకునే బాధ్యత ప్రజలదేననే చైతన్యాన్ని అందించాలి. విప్లవ శక్తులను కాపాడుకోవడమంటే తమను తాము కాపాడుకోవడమేననే చైతన్యాన్ని ప్రజలు అలవర్చుకోవాలి. ముఖ్యంగా శత్రు దాడి నుండి మన పార్టీనీ, పీఎల్‌జీఏ బలగాలను రక్షించుకునేందుకు బలమైన ప్రజా ఇంటెలిజెన్స్‌ను వివిధ రూపాలలో దొంతరలు–దొంతరలుగా నిర్మాణం చేసి, అభివృద్ధి చేయాలి. మన సమాచారం శత్రు ఇంటెలిజెన్స్‌కు అందకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవాలి. ప్రజా ఇంటెలిజెన్స్ నుంచి వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సరిగా విశ్లేషించుకుని

తగిన నిర్ణయాలు తీసుకుని అమలు చేయడం ద్వారా మన స్వీయాత్మక శక్తులను కాపాడుకోగలుగుతాం. దీనిపై యావత్తు పార్టీ కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

## ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా,

దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు, సూపర్ లాభాల కోసం సామ్రాజ్యవాదులు గొంతులు కోసుకునే పోటీకి దిగుతున్నారు. ఇందుకోసం వారు విధ్వంసకర విధానాలు అనుసరిస్తున్నారు. కోల్పోయిన అమెరికా ఏకధృవ ప్రపంచాధిపత్యాన్ని సాధించుకోవడానికి అత్యంత దూకుడుగా రాజకీయ, భౌగోళిక, ఆర్థిక విధానాలను జోబైడెన్ అమలు చేస్తున్నాడు. ఉక్రెయిన్ పట్ల అమెరికా విధానాలు, అమెరికా–నాటో విస్తరణను అడ్డుకునేందుకు రష్యా చేపట్టిన చర్యల వలన అంతర్జాతీయంగా మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమైన ఫలితమే ఉక్రెయిన్‌పై రష్యా సామ్రాజ్యవాద దురాక్రమణ దాడి. ఒకవైపు ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాద ప్రచ్ఛన్న యుద్ధం గత మూడు నెలలుగా వినాశకరంగా కొనసాగుతుండగా, మరోవైపు తైవాన్ పట్ల అమెరికా, చైనా సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న విధానాలు సైతం ఈ దిశగానే కొనసాగుతున్నాయి. సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక, ఆధిపత్య ప్రయోజనాల ఆటలో ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం తదితర పీడిత వర్గాల, పీడిత జాతుల ప్రజలు బలవుతున్నారు. సామ్రాజ్యవాదం అంటే యుద్ధం, ఫాసిజం, వినాశనం, సంక్షోభం, నిరుద్యోగం, ఆకలి, మృత్యువు అని ఉక్రెయిన్ యుద్ధం మరోసారి రుజువు చేసింది. ఈ యుద్ధానికి వ్యతిరేకంగా, సూపర్ లాభాల కోసం యావత్తు విశ్వాన్ని బలిచేసే అణ్వాయుధాలతో సహా పలు ప్రాణాంతక ఆయుధాల అమ్మకం, సైనిక బలగాల మోహరింపులతో ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం వైపుగా ఈడుస్తున్న సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా రష్యాతో సహా ప్రపంచవ్యాప్తంగా లక్షల, కోట్ల మంది ప్రజలు నిరసనోద్యమాలు కొనసాగిస్తున్నారు. ఆర్థిక సంక్షోభం ఫలితంగా ప్రజల తిరుగుబాటుతో శ్రీలంకలో నిరంకుశ రాజపక్షే ప్రభుత్వం కూలిపోవడం ఇందుకు స్పష్టమైన నిదర్శనం. అయితే ఫాసిజాన్ని క్రూరంగా అమలు చేయడం ద్వారా ఈ పోరాటాలను అణచివేసేందుకు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు, వారి తొత్తు పాలకులు ఎంతటి దురాగతాలకైనా ఒడిగడుతున్నారు. అయినప్పటికీ ఫాసిస్టు అణచివేత మధ్యనే ప్రపంచవ్యాప్తంగా కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజల మిలిటెంటు పోరాటాలు వెల్లువెత్తున్నాయి. ఇండియాలో మోదీ ప్రభుత్వం అమెరికా, రష్యాలతో సహా యావత్తు సామ్రాజ్యవాద దేశాలతో పలు దోపిడీ ఒప్పందాలు చేసుకుని ఉండడం, ఈ యుద్ధం పట్ల ద్వంద్వ విధానాలు అనుసరించడంతో ఉక్రెయిన్‌లో భారతీయులు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. దీన్ని దేశ ప్రజలంతా నిరసించారు. సామ్రాజ్యవాదాన్ని, దానికి ఊడిగం చేసే దళారీ పాలకవర్గాలను ఈ భూమండలం నుంచి నిర్మూలించి సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని స్థాపించడానికి, కార్మికవర్గం నాయకత్వంలో ప్రపంచ కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాల ప్రజలు, పీడిత జాతులు, ప్రజాస్వామికవాదులు సమైక్యంగా ఈ ఉద్యమాలను పురోగమింపజేయడమే ఏకైక మార్గం.

ఇండియాలో కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల ప్రభుత్వాలు, ఇతర ప్రభుత్వాలు ఏవైనా గానీ సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గం, బడా భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ నయా ఉదారవాద, కార్పొరేట్ ప్రాయోజిత విధానాలను పెద్దెత్తున అమలు చేస్తున్నాయి. ఫలితంగా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, అంబానీ, అదానీ వంటి పిడికెడు మంది దళారీ బడా పెట్టుబడిదారులు సూపర్ లాభాలు గడిస్తున్నారు. నిరుద్యోగం, ఆదాయాలు పడిపోవడం, అధిక ధరలు, వ్యవసాయ సంక్షోభం కారణంగా, ప్రత్యేకించి కోవిడ్ మహమ్మారి వచ్చిన తర్వాత ప్రజల జీవనం దుర్భరంగా మారిపోయింది. ముఖ్యంగా సామ్రాజ్యవాదులు, భారత దళారీ పాలకులు తమ దోపిడీని నిరాఘాటంగా కొనసాగించే దుష్ట పథకంలో భాగంగా దేశం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తుల ఇష్టారాజ్యంగా మారింది. ఈ హిందుత్వ శక్తులు 'న్యూ ఇండియా' నిర్మాణం, 'వన్ నేషన్ వన్ ఎవ్రిథింగ్' పేరుతో దేశాన్ని 'హిందుత్వ రాజ్యంగా' మార్చేస్తున్నాయి. హిందుత్వ మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రాజ్యాంగబద్ధ సంస్థల్ని కాషాయీకరించింది. రైతులు, కార్మికులు, మధ్యతరగతి వర్గాలకు వ్యతిరేకంగా, మహిళ, దళిత, ఆదివాసీ, ముస్లిము తదితర సామాజిక సెక్షన్లకు వ్యతిరేకంగా కార్పొరేట్ ప్రాయోజిత చట్టాలు తీసుకొచ్చింది. విద్యను కార్పొరేటీకరించి, కాషాయీకరించి, ఆన్‌లైనీకరించి, పేద ప్రజలకు అందకుండా చేసింది. అధికారబలం, మంది బలంతో హిందుత్వ శక్తులు 'గో రక్షణ', 'పరువు' పేరుతో ముస్లిములపై, ఆదివాసులపై, దళితులపై దాడులు-హత్యలు నిరాటంకంగా కొనసాగిస్తున్నాయి. కర్నాటక విద్యాలయాల్లో ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధారణపై నిషేధం వంటి చర్యల ద్వారా ముస్లిం మత ఆచార వ్యవహారాలపై దాడి చేస్తున్నాయి. 'కశ్మీర్ ఫైల్స్' సినిమా, హలాల్ మాంసం వివాదం, పట్టణాలు, వివిధ సంస్థల పేర్ల కాషాయీకరణ ద్వారా కశ్మీర్ జాతి వ్యతిరేక, ముస్లిం వ్యతిరేక ఉన్మాదం రెచ్చగొడుతున్నాయి. తద్వారా ప్రజల్లో మతపరమైన చీలికలు తీసుకొస్తున్నాయి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం పట్ల ఎక్కడికక్కడ చెలరేగుతున్న వివిధ పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజల తీవ్ర వ్యతిరేకతను క్రూరంగా అణగదొక్కుతున్నాయి. జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-యావత్తు హక్కుల నుంచి ఆదివాసులను వంచితుల్ని చేస్తున్నారు. 'హస్‌దేవ్ అరణ్యం' వంటి పలు అభయారణ్యాలను, దేశ యావత్తు వనరులను వేగంగా కార్పొరేటీకరిస్తున్నారు. బహుళజాతి కంపెనీల గనులు, కంపెనీలు, ప్రభుత్వ భారీ డ్యాములు, రోడ్లు, రైలు మార్గాల నిర్మాణాలు, 'అభయారణ్యాలకు' అనుమతినీయడం ద్వారా ప్రజలను బలవంతంగా నిర్వాసితం చేస్తున్నారు. కార్పొరేట్ కంపెనీల రక్షణకై కార్పొరేట్ సెక్యూరిటీలో భాగంగా పోలీసు, పారామిలటరీ, కమాండో బలగాల క్యాంపులు పెంచడం/సైనికీకరణ చేస్తున్నారు.

లఖింపుర్‌లో రైతులను హత్య చేసిన కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న రైతును ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో తిరిగి ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకున్న వెంటనే చంపేసారు. హిందూ దేవాలయాల వద్ద ముస్లిము దుకాణదారుల వద్ద పండ్లు, కూరగాయలు, మాంసం వగైరా కొనుగోలు చేయవద్దని

కర్నాటకలో బీజేపీ పిలుపునిచ్చింది. మసీదులను కూలగొట్టి హిందూ దేవాలయాల నిర్మాణం చేసే కుట్రలో భాగంగా లక్నోలోని జ్ఞానవాపీ మసీదు చెరువులో దొంగచాటుగా శివలింగాన్ని అమర్చి, ఆ మరుసటి రోజు అక్కడ శివలింగం దొరికిందని చెప్పారు, ఇప్పుడు అక్కడ శివాలయాన్ని కట్టాలని చూస్తున్నారు. 'లవ్ జిహాద్' పేరుతో ముస్లిములపై దాడులు పెరిగాయి. ఢిల్లీలోని జహంగీర్‌పుర్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తూ మోదీ ప్రభుత్వం వారి ఇండ్ల మీదకు బుల్‌డోజర్లతో దండెత్తింది.

మోదీ ప్రభుత్వం చెప్పే 'అభివృద్ధి' అంటే సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీల, దేశంలో వాటి దళారీ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల అభివృద్ధి మాత్రమే, కుల, మతాల పేరుతో దేశాన్ని విభజించడం మాత్రమే తప్ప మరొకటి కాదు. ప్రభుత్వం ఒక వైపు ప్రజలకు గల రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘిస్తూ, మరో వైపు ఈ ఉల్లంఘనను వ్యతిరేకిస్తూ, ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేసే సామాజిక కార్యకర్తలను దేశద్రోహులుగా, 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేస్తూ జైళ్లలో కుక్కుతోంది. కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడమే నిజమైన అభివృద్ధి, నిజమైన దేశభక్తి తప్ప ప్రజల, దేశ అభివృద్ధిని విస్మరించడం దేశభక్తి కాదు.

గత మూడేళ్లుగా దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు, తమపై మోపిన పన్నుల భారానికి, రాజ్య ఫాసిస్టు నిర్బంధానికీ వ్యతిరేకంగా దేశంలో వివిధ వర్గాల, సెక్షన్ల ప్రజల, ఆదివాసుల, పీడిత జాతుల సమరశీల పోరాటాలు కొనసాగుతున్నాయి. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా భారత రైతాంగం ఒక సంవత్సరం పైగా సమరశీల పోరాటం చేసి మోదీ ప్రభుత్వం మెడలు వంచి వాటిని రద్దు చేయించడంలో పెద్ద విజయం సాధించింది. అయితే అది రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా 'విశ్వాసఘాతుకత్వానికి' పాల్పడినందుకు నిరసనగా రైతాంగం పోరాటం కొనసాగిస్తోంది. మోదీ ప్రభుత్వం నూతన అటవీ చట్టం-2019, 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, ఆ కార్మిక చట్టాల స్థానంలో 4 కోడ్స్ రూపొందించింది. అయితే ప్రభుత్వం ఊహించని రీతిలో ఆదివాసులు, కార్మికుల నుండి ప్రతిఘటన ఎదురయింది. మార్చి 28-29లలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మె మునుపెన్నడూలేని విధంగా రైతాంగం మద్దతుతో విజయవంతం అయింది. దీనితో యిప్పటి వరకు మోదీ ప్రభుత్వం ఈ చట్టాలను అమలు చేయలేకపోయింది. కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను కల్పించే 370-35ఏ ఆర్టికల్స్‌ను రద్దు చేసిన బీజేపీ అక్కడి ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. ఈశాన్య రాష్ట్రాల్లో నగా, మిజో, మణిపూర్ తదితర జాతుల విముక్తి పోరాటాలను హిందుత్వ మోదీ ప్రభుత్వం సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి అణచివేసేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నది కానీ ఆ పీడిత జాతుల ఆకాంక్షలు నెరవేరాలంటే 'విడిపోయే హక్కుతో సహా' స్వయంనిర్ణయాధికారం కోసం పోరాడడం తప్ప మరో మార్గం లేదు. అందువల్లనే ఇటీవల నగాలాండ్‌లో ఓటింగ్ గ్రామంలో 14 మంది అమాయక ప్రజలను క్రూరంగా

హత్య చేయడానికి నిరసనగా అఫ్స్పా చట్టానికి వ్యతిరేకంగా నిరసన జ్వాలలు చెలరేగాయి. ఫలితంగా దానిని కూడా చాలా ప్రాంతాల్లో రద్దు చేయాల్సి వచ్చింది.

దేశవ్యాప్తంగా కార్పొరేటీకరణకు, సైనికీకరణకు వ్యతిరేకంగా పెద్దెత్తున్న జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు, వర్గ పోరాటాలకు మన పార్టీ నాయకత్వం వహిస్తున్నది, భాగస్వామ్యం వహిస్తున్నది. గెరిల్లా ప్రాంతాలలో పీఎల్‌జీఏ ప్రతిఘటన కొనసాగుతున్నది. నవంబర్ 24 తారీఖున 'భారత దేశంలో జరుగుతున్న ప్రజాయుద్ధానికి' మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం, కార్మికవర్గ పార్టీలు అనేక దేశాల్లో ప్రదర్శనలు చేసారు. ఈ పిలుపుకు దాదాపు 30 దేశాల నుండి స్పందన లభించింది. జీ-20 సమావేశం కోసం మోదీ రోమ్‌కు చేరుకున్న సందర్భంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఇందులో లక్ష మంది మహిళలు పాల్గొన్నారు. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు విప్లవ శక్తులు స్వీయాత్మక బలాన్ని పుంజుకుంటూ క్రమంగా సంఘటితపడడం అనుకూలమైన పరిణామం.

ఈ పరిణామాలను చూస్తే, అంతర్జాతీయంగా, దేశీయంగా విప్లవ పరిస్థితులు పెంపొందుతున్నాయనేది స్పష్టమవుతోంది. ఈ విప్లవ పరిస్థితులను వినియోగించుకోవడం మన పార్టీ ప్రధాన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేందుకు, భారత విప్లవోద్యమాన్ని తాత్కాలిక వెనకంజ నుంచి బయటకు తీసుకొచ్చి, పురోగమింపజేయడానికి వర్గ పోరాటమే కీలకాంశంగా ఉ ంటుంది. వర్గ పోరాటాల నుంచి నూతన కార్యకర్తలు, నాయకత్వం అభివృద్ధి చెందుతారు. కొత్త పరిస్థితులకు తగిన పని పద్ధతులు, ఎత్తుగడలు రూపొందుతాయి. వీటి ద్వారా శత్రుదాడుల్ని పసిగట్టి, ప్రతిఘటించే పద్ధతులను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుంది. అనవసర నష్టాలు, అరెస్టులను నివారించడం సాధ్యమవుతుంది. వీటిపై ఆధారపడి విప్లవోద్యమ అభివృద్ధి, విస్తరణ జరుగుతుంది. శత్రువు ప్రతీఘాతుక దాడులు కొనసాగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ప్రధానంగా రహస్య పని విధానాన్ని అమలు చేయాలి. పార్టీని శత్రువుకు అభేద్యమైన పార్టీగా పునఃసంఘటితం చేయాలి. పార్టీ సంఘటితీకరణలో ఇది చాలా ముఖ్యమైనది.

మన మార్గం సుదీర్ఘమైంది, కష్టభరితమైంది. 21వ శతాబ్దంలో అనుకూలంగా మారుతున్న పరిణమాలను ఉపయోగించుకునేందుకు దీటుగా మనల్ని మనం నూతనంగా తయారు చేసుకోవడానికి/మలుచుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేయాలి. పార్టీలో పై నుంచి కింది వరకూ యావత్తు కేడర్లు మంచి కమ్యూనిస్టులుగా, నిపుణులుగా తయారయ్యేందుకు స్వయంగా వర్గ పోరాటంలో పాల్గొనాలి. వర్గ నిర్మాణం, అభివృద్ధిపై కేంద్రీకరించాలి. ప్రతీ కార్యకర్తా ఊగిసలాటలేని సరైన రాజకీయ వైఖరి, సాదాసీదా జీవనం, కష్టపడి పని చేసే శైలి, పట్టు-విడుపులతో కూడిన ఎత్తుగడలు అమలు చేయడంలో పట్టు సాధించాలి. నాయకత్వం, కార్యకర్తలు సమైక్యం కావాలి. వారిలో జాగరూకత, నిజాయితీ ఉండాలి, వారు నిరంతరం జీవం తొణకిసలాడుతూ ఉండాలి.

నాయకత్వం, కార్యకర్తలు ఐక్యమవుతూ ప్రజలతో మమేకం కావడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని కార్యకలాపాలలోను రాజకీయ కృషికి ప్రాధాన్యత ఇవ్వాలి. రాజకీయ కృషిలో సిద్ధాంత కృషికి ప్రాధాన్యత ఇవ్వాలి. సిద్ధాంత కృషిలో సృజనాత్మక అధ్యయనానికి, సిద్ధాంతాన్ని ఆచరణకు జోడించటానికి, ఆచరణ నుంచి వచ్చిన అనుభవాన్ని సైద్ధాంతిక స్థాయికి తీసుకుపోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

అమరుల ఆదర్శవంతమైన, స్ఫూర్తిదాయకమైన గొప్ప విప్లవ జీవితాలు స్వీయాత్మకంగా మనం ఎదుర్కొంటున్న తాత్కాలిక వెనకంజ పరిస్థితులను అధిగమించటానికి, పెంపొందుతున్న విప్లవ పరిస్థితిని వినియోగించుకొని పురోగమించటానికి పార్టీకీ, యావత్తు విప్లవ శక్తులకు తగిన శక్తినందిస్తాయి. అమరులు లేనిలోటు అనతికాలంలో పూడ్చలేనిదనేది నిస్సందేహం. అయినప్పటికీ వారి మార్గంలోనే విప్లవకర ఎంఎల్ఎం సిద్ధాంతంపై, అశేష పీడిత ప్రజారాశులపై మనం సంపూర్ణంగా విశ్వాసం కలిగి ఏటికెదురీదుతూ విప్లవ లక్ష్యసాధనకు పాటుపడినంత వరకు కష్టనష్టాలు, తాత్కాలిక వెనకంజలు మన సంకల్పాన్ని సడలించలేవు. లక్ష్యసిద్ధికి మన కృషిని ఆపలేవు. మన మహా నాయకులైన కామ్రేడ్స్ సీఎం, కేసీ, సరోజ్ దత్తా, అమూల్యసేన్, చంద్రశేఖర్ దాస్, సత్యం, కైలాసం, బరుణ్ దాద నుంచి మొదలుకొని కామ్రేడ్ దీపక్ వరకు వేనవేల జ్ఞాత, అజ్ఞాత వీరయోధుల అమరత్వాల నుంచి మనం ఈ విధమైన చైతన్యాన్ని ద్విగుణీకృతం చేయాలి. వారు భౌతికంగా మన నుంచి దూరమైనా మన ఆలోచనల్లో వారు నిరంతరం మనకు ప్రేరణనందిస్తూనే ఉంటారు. ఒక చేత్తో కన్నీరు తుడుచుకుని వేరొక చేత్తో ఎర్రజండా ఎత్తుకుని ముందుకు సాగేలా మన వెన్నుతడుతూనే ఉంటారు. కనుక మనం వారి అడుగుజాడలలో మరింత దృఢంగా, సమైక్యంగా ముందుకు సాగాలి తప్ప నీరుగారిపోకూడదు. నిరాశా–నిస్పృహలకు గురికాకూడదు. ఇదే ఒక విప్లవకర కమ్యూనిస్టు పార్టీగా మన పార్టీ విశిష్టత అని చాటిచెబుదాం. అమరుల త్యాగాలను వృధా కానివ్వమని ప్రతిన బూనుదాం. ప్రజా పోరాటాల, వర్గ పోరాటాల వెల్లువకు నాయకత్వాన్ని అందించేందుకు కృషి చేస్తూ భారత ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం–విస్తృతం చేయడం ద్వారా శత్రు వ్యూహాత్మక 'సమాధాన్'–ప్రహార్ దాడిని ఓడిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేద్దాం.

## అమరుల సంస్మరణ వారం కార్యక్రమం

1. ప్రస్తుత అమరుల సంస్మరణ వారం సందర్భంగా కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హాయ్ చటర్జీల వర్ధంతులను పురస్కరించుకుని భారత విప్లవానికి వారందించిన మహోన్నత, అసాధారణ సేవలను సంస్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో నడుస్తూ, దేశంలో కొనసాగుతున్న సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని ఉన్నతస్థాయికి ఎదిగించేందుకు పాటుపడాలనే సందేశాన్ని మన కేడర్లకు, ప్రజలకు అందించాలి. వాడవాడలలో, గ్రామగ్రామాన పట్టణాలలో అక్కడి నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా బహిరంగ, రహస్య పద్ధతుల్లో అమరుల స్మృతిలో సంస్మరణ సభలను నిర్వహించి కేంద్రకమిటీ సందేశాన్ని ప్రజల వద్దకు చేర్చాలి. అమరుల కుటుంబ సభ్యులను ఈ సభలకు ఆహ్వానించాలి, వేదికపై కూర్చోబెట్టాలి, సభాముఖంగా వారిని పరిచయం చేయాలి. వీలును బట్టి మాట్లాడించాలి.
2. కామ్రేడ్ కన్హయ్ చటర్జీ జీవిత చరిత్రను, ఐక్యపార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకూ అమరులైన కేంద్రకమిటీ సభ్యుల జీవితచరిత్రలను రెండు సంపుటాలుగా కేంద్రకమిటీ విడుదల చేసింది. వాటిని సంస్మరణ సభలలో ఆవిష్కరించాలి.
3. అమరుల కుటుంబ సభ్యులకు సంతాప సందేశాన్ని వారి జీవిత చరిత్రలను, ఫోటోలను, వారి జ్ఞాపక చిహ్నాలను అందించాలి. వారి బాధలలో, దుఖంలో పాలు పంచుకుంటూ వివిధ రూపాలలో వారికి అవసరమైన మద్దతునందించాలి. అమరుల స్ఫూర్తితో వారిని విప్లవోద్యమం పక్షాన గట్టిగా నిలబెట్టుకోవాలి.
4. స్పెషల్ ఏరియా/స్పెషల్‌జోన్/రాష్ట్రాల వారిగా, జోన్/డివిజన్/జిల్లాల వారిగా మరియు ఏరియాల వారిగా అమరుల జీవిత చరిత్రలను ప్రచురించాలి. అమరుల త్యాగాలను ఆదర్శాలను, వారి మంచి అలవాట్లను ఎత్తిపడుతూ కరపత్రాలు, పోస్టర్లు, బ్రౌచర్లు, బ్యానర్లు విడుదల చేయడంతో పాటు వారిపై కవితలు, కథలు, నాటకాలు రచించి ప్రచురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. దీని కోసం ప్రింటింగ్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాను అవసరమైన జాగ్రత్తలతో ఉపయోగించుకోవాలి. అమరుల స్థూపాలను వేరు వేరు చోట్ల నిర్మించి ఆవిష్కరించాలి.
5. విప్లవ సాంస్కృతిక సంఘాల ద్వారా అమరుల జీవిత చరిత్రలను, వారి త్యాగాలపై పాటలు, గ్రూప్ సాంగ్స్, గ్రూప్ డాన్స్, నాటికలు మొదలయిన వివిధ కళారూపాలను తయారుచేసి ప్రత్యక్షంగా ప్రదర్శనలు ఇవ్వాలి. అలాగే డిజిటల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేయాలి.
6. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని పై కార్యక్రమాలను అమలు చేయాలి. మన ప్రియమైన అమరుల అత్యున్నత త్యాగాల స్ఫూర్తితో శత్రు 'సమాధాన్'-ప్రహార్ దాడులను ఓడించేలా ప్రజలను రాజకీయంగా ఎడ్యుకేట్ చేసుకునే క్యాంపెయిన్ లాగా అమరుల సంస్మరణ వారాన్ని నిర్వహించాలి.

## నినాదాలు

☆ మన పార్టీ సంస్థాపక నాయకులు, ఉపాధ్యాయులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీలకు ఎర్రెర్ర దండాలు! అమరులందరికీ జోహర్లు!

☆ అమరుల ఆశయాలను కొనసాగిద్దాం! అమరుల త్యాగాలను ఎత్తిపడుదాం!

☆ ప్రతిఘాతుక వ్యూహాత్మక అణచివేత పథకం 'సమాధాన్'-ప్రహర్ దాడులను ఓడిద్దాం!

☆ ఉక్రెయిన్‌లో సామ్రాజ్యవాద ప్రచ్ఛన్న యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడండి!

☆ దండకారణ్య ప్రజలపై తలపెట్టిన డ్రోన్ దాడులను వ్యతిరేకిద్దాం!

☆ విప్లవోద్యమ ప్రాంతాలలో భారత సైన్యాలను దింపడాన్ని వ్యతిరేకిద్దాం!

☆ మావోయిస్టు గెరిల్లా యుద్ధ నియమాలను కచ్చితంగా అమలు చేద్దాం! అనవసర నష్టాల నుండి బయటపడుదాం!

☆ దండకారణ్యం, బిహార్-జార్ఖండ్, తూర్పు బిహార్-ఈశాన్య జార్ఖండ్‌లను స్థావర ప్రాంతాలుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పని చేద్దాం!

☆ సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం!

☆ గెరిల్లా యుద్ధాన్ని-ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం!

☆ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ఓడిద్దాం!

☆ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి! ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!

☆ సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానం నశించాలి!

☆ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జిందాబాద్!

☆ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం జిందాబాద్!

**మే 27, 2022**

**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**